క్లుప్తంగా

వ్యవసాయ మార్కెట్‌లో ఎమ్మెల్యే పరిశీలన

నర్సంపేట : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లోని భవనాన్ని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శనివారం సందర్శించి పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న రెవెన్యూ కార్యాలయాన్ని వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న భవనంలోకి మార్చే అవకాశాలపై రెవెన్యూ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డిని మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు.

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

నల్లబెల్లి : గ్రామాలు, వ్యవసాయ భూములను ముంపునకు గురిచేసేలా రంగాయ చెరువు రీడిజైన్ ప్రతిపాదనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినందుకు మండలంలోని ఆసరవెల్లి గ్రామస్తులు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. లక్ష్మీతండా, ఆసరవెల్లి, మేడపల్లి గ్రామాల రైతులు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాలకు చెందిన కట్ట రాజు, చెవ్వల రాణి, గండు మల్లేశం, బీరవెల్లి శేఖరయ్య, దుప్పెల్లి ఎలీషా, నాంపెల్లి అవినాశ్, షేక్ రహేనాలకు ఎమ్మెల్యే నాగరాజు నివాసంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండారి సతీశ్ శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు లబ్ధిదారులకు చెక్కులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరుకుడు వెంకటయ్య, తీగల సునీత, కొండబేటి మధూకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు..

సంగెం : మండలంలోని ఎల్గూర్ రంగంపేటకు చెందిన వల్లెపు రాజు ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందగా ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ నుంచి మంజూరైన రూ.20 లక్షల బీమా చెక్కును అతడి సతీమణి కవితకు గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ సుల్తాన్ వెంకయ్య శనివారం అందజేశారు. అనంతరం మేనేజర్ మాట్లాడారు. రాజు గ్రామీణ వికాస్ బ్యాంకులో ఖాతా కలిగి ఉండి ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ చేశాడని తెలిపారు. ఈ క్రమంలో రాజు రైలు ప్రమాదంలో మృతి చెందడంతో మంజూరైన బీమా డబ్బును నామినీ అయిన కవితకు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో క్యాషియర్ విష్ణు, బ్యాంకు ఉద్యోగి రాజు, తదితరులు పాల్గొన్నారు.

విరాళం

వర్ధన్నపేట : పట్టణంలో గణపతి విగ్రహ ఏర్పాటు కోసం మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ నిర్వాహకులకు శనివారం రూ.30 వేల విరాళం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈనెల 7 నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన, ఇతర కార్యక్రమాల కోసం విరాళం అందచేసినట్లు తెలిపారు.

పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్ బహూకరణ

దుగ్గొండి : మండలంలోని వెంకటాపురం శివారులోని లక్కమారిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన ఏడాకుల ఉమా మహేశ్వర్‌రెడ్డి శనివారం రూ.30 వేల విలువైన వాటర్ ప్యూరిఫయర్‌ను బహూకరించారు. ఈ మేరకు ప్యూరిఫయర్‌ను ఆయన హెచ్‌ఎం గోపాల్‌దాస్ శ్రీవిద్యకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. విద్యార్థులకు శుద్ధమైన నీరు అందించేలా ప్యూరిఫైర్ అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి సమాజం భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

ఏసీపీకి ఫిర్యాదు

నర్సంపేట : తన ఇంటి నిర్మాణ విషయంలో తమను ఇబ్బందులకు గురి చేస్తున్న పట్టణానికి చెందిన మాధవశంకర్, గోవర్ధన్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణానికి చెందిన కొలువుల వెంకటేశ్వర్లు, కొలువుల ఎల్లయ్య స్థానిక ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు ఏసీపీ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వెంకటేశ్వర్లు, ఎల్లయ్య మాట్లాడారు. తమ తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిలో తాము ఇళ్లు కట్టుకుంటుండగా నాలుగేళ్లుగా తమను మాధవశంకర్, గోవర్ధన్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. అధికారులను తప్పుదోవ పట్టిస్తూ తమను వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. న్యాయం చేయాలని కోరారు.

సీఐటీయూలో చేరిక

గీసుకొండ : మండలంలోని ప్రగతి పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు సామిల్ కార్మికులు, హమాలీలు సీఐటీయూ అనుబంధ ఆల్ మిల్ వర్కర్స్ యూనియన్‌లో శనివారం చేరారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇనుముల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాయిని రమేశ్ మాట్లాడారు. పలువురు కార్మికులు నాయిని కుమారస్వామి, ఇనుముల వీరన్న సమక్షంలో చేరి సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేట-గురిజాల దారిలోని కాజ్‌వేపై నీటి ఉధృతి



నెక్కొండ : పట్టి వాగులో..



ఎడతెరిపిలేని వర్షంతో అతలాకుతలం

నర్సంపేట, నెక్కొండ, పర్వతగిరి, ఖానాపురం, దుగ్గొండి, చెన్నారావుపేట, సంగెం, తదితర మండలాల్లో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో జనజీవనం అతలాకుతలం అయ్యింది. పలు చెరువులు మత్తడి పోస్తున్నాయి. కొన్ని చోట్ల రాకపోకలు స్తంభించాయి, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పంటలు నీట మునిగాయి. కాల్వలకు గండ్లు పడ్డాయి.

-సాక్షి నెట్‌వర్క్



దుగ్గొండి : జేసీబీతో కాల్వ తీయిస్తున్న అధికారులు



పర్వతగిరి : ఇన్సులేటర్ మార్చుతున్న విద్యుత్ సిబ్బంది



ఖానాపురం : నాజీతండా కల్వర్టుపై వరద నీరు



పర్వతగిరి : పెద్దతండాలో ఇళ్లలోకి చేరిన నీరు



చెన్నారావుపేట : నేలవాలిన విద్యుత్ స్తంభం

సభ్యత్వ నమోదుతో బీజేపీ బలోపేతం



గీసుకొండ : మాట్లాడుతున్న డాక్టర్ కాళీప్రసాద్

గీసుకొండ : సభ్యత్వ నమోదుతో బీజేపీ బలోపేతం కావాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గట్టికొప్పుల రాంబాబు ఆకాంక్షించారు. మండలంలోని ధర్మారంలోని పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెలలో ప్రారంభం కానున్న సభ్యత్వ నమోదును మండలంలో విజయవంతం చేయాలని శ్రేణులకు సూచించారు. అన్ని బూత్‌ల స్థాయిల్లో 200 మందికి తగ్గకుండా సభ్యులను చేర్పించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ పరకాల అసెంబ్లీ కన్వీనర్ ముల్క ప్రసాద్, మండల అధ్యక్షుడు జాన్ విక్రం, ప్రధాన కార్యదర్శి కొంగర రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కత్ర శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్ మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నూనె అనిల్, జిల్లా ప్రచార కార్యదర్శి వడ్లకొండ రవి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎనగందుల శ్రావణ్‌కుమార్, నాయకులు బూర్గు నవీన్, మందపురి రాజు, సురేశ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా మోరీ

పట్టణంలోని 10వ వార్డులో మోరీ ప్రమాదకరంగా తయారైంది. రెండు చోట్ల సీసీ రోడ్లు వేసిన చోట లింక్ రోడ్డుకు వెళ్లే మోరీపై చలవ రాతి బండలు లేదా సిమెంట్ బిళ్లలు వేయకపోవడంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. సీసీ రోడ్లు వేసి మూడేళ్లు గడచినా మోరీలపై బండలు వేయకపోవడంపై కాలనీవాసులు ఆందోళనకు గురవుతున్నారు. పలువురు మోరీలో పడి గాయాలపాలైనా అధికారులు పట్టించుకోవడం లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా మునిసిపల్ అధికారులు స్పందించి బండలు వేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. -వర్ధన్నపేట

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
అయిలయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్
ఫోన్‌నంబర్ : 9701839389

అధికారులే నిర్లక్ష్యం చేస్తే ఎలా?

- జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ రాంరెడ్డి
- విధులకు గైర్హాజరైన ఎంపీడీఓ, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, అటెండర్‌కు ఒక్కరోజు వేతనం నిలిపివేత



ఖానాపురం : మండల పరిషత్ కార్యాలయ ఆవరణను పరిశీలిస్తున్న సీఈఓ రాంరెడ్డి

ఖానాపురం: అధికారులే నిర్లక్ష్యం చేస్తే కార్యాలయాలకు దిక్కెవరని ఇన్‌చార్జ్ డీపీఓ, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి ప్రశ్నించారు. ఎంపీడీఓ కార్యాలయాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధులకు హాజరుకాని ఎంపీడీఓ భారతి, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ పృథ్వీరాజ్, అటెండర్ చంద్రశేఖర్‌లకు గైర్హాజరు వేసి ఒక్కరోజు వేతనాన్ని నిలిపివేస్తున్నట్లు తెలిపారు. రికార్డులు, గదులు, పరిసరాలను పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయం శుభ్రంగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. జీపీ సిబ్బందితో కార్యాలయం ఎదుట నీటిని తొలగింపజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 3.95 లక్షల మందికి పైగా ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఓటరు జాబితా ఆన్‌లైన్ నమోదు 70 శాతం పూర్తి అయిందని చెప్పారు. మిగితా రెండు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. డీపీఓ వెళ్లిపోయే సమయంలో ఎంపీడీఓ భారతి, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి వచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

వార్డుల విభజన వేగవంతం చేయాలి

నల్లబెల్లి: పంచాయతీ ఎన్నికల కోసం వార్డుల విభజన వేగవంతం చేయాలని జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ రాంరెడ్డి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితా తయారీ, ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలించారు. వార్డుల విభజన వివరాలను ఎంపీడీఓ నర్సింహమూర్తిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీఓ పసరగొండ రవి, సీనియర్ అసిస్టెంట్ శారద, టైపిస్టు గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్, ధర్మేందర్, శాంత, రజిత, సరస్వతి, మౌనిక, అఖిల ఉన్నారు.

ముగిసిన శ్రీ కృష్ణుడి జన్మదిన వేడుకలు

చెన్నారావుపేట : మండల కేంద్రంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి జన్మదిన వేడుకలు శనివారం ముగిశాయి. ఆగస్టు 26న మండల కేంద్రంలో వేదిక నిర్మించి శ్రీకృష్ణుడి ప్రతిమను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. నాటి నుంచి రోజూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం శ్రీ కృష్ణుడి ప్రతిమను ఊరేగించారు. కార్యక్రమంలో జ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఓం ప్రకాశ్ ఆచారి, కిరణ్ చారి, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చోరీ

చెన్నారావుపేట: తిమ్మరాయినిపహాడ్‌లో చోరీ జరిగిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన పూదోట విన్సెంట్, రాజు ఇళ్ల తాళాలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి విన్సెంట్ ఇంట్లో రూ.50 వేల నగదు, 12 తులాల వెండి, రాజు ఇంట్లో రూ. 1.75 లక్షల నగదు చోరీ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నర్సంపేట రూరల్ : ట్రస్మా, ప్రజ్ఞ వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ టెక్నో స్కూల్ విద్యార్థులు అక్షయ, ఇతిహాసిని ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థులకు పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ శనివారం బహుమతులు ప్రదానం అభినందించి మాట్లాడారు. విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో టీచర్లు రియాజ్, క్రాంతికుమార్, భవానీ పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించాలి

నర్సంపేట : పట్టణంలో పేదలు నివాసం ఉంటున్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని కార్ల్ మార్క్స్ కాలనీలోని ఇళ్లలోకి వరదనీరు చేరగా ఆమె ఆధ్వర్యంలోని బృందం శనివారం సందర్శించి పరిస్థితిని అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా కాలనీవాసులతో సమస్యలపై రాగసుధ మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం రాగసుధ మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో వార్డుల్లో సైడ్ కాల్వలు నిర్మించకుండానే వల్లబ్‌నగర్, మల్లంపల్లి రోడ్డు నుంచి వచ్చే వరద నీటిని కార్ల్ మార్క్స్ కాలనీ వైపు మళ్లించారని గుర్తు చేశారు. మునిసిపల్ కమిషనర్, అధికారులు స్పందించి వరద నీటిని పైపులైన్ల ద్వారా మళ్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ డివిజన్ కమిటీ సభ్యురాలు జన్ను జమున, నాయకులు సిరిపెల్లి సంపూర్ణ, గణిపాక బిందు, ఈసంపెల్లి కోమల, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాచైతన్యమే ధ్యేయం

నర్సంపేట : దోపిడీ వ్యవస్థ నుంచి కాపాడేలా ప్రజలను చైతన్యవంతం చేయడమే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ధ్యేయమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు గోవర్ధన్ తెలిపారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు వేణు అధ్యక్షతన శనివారం నిర్వహించిన అరుణోదయ జనరల్ కౌన్సిల్ సమావేశానికి గోవర్ధన్ అతిథిగా హాజరై మాట్లాడారు. పాలకుల తప్పుడు విధానాలు, సమాజంలోని సమస్యలపై పాటల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసే దిశగా అరుణోదయ పని చేస్తోందని చెప్పారు. అనంతరం ఆహ్వాన సంఘం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా డాక్టర్ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా రాచర్ల బాలరాజు, కోశాధికారిగా ఎలకంటి రాజేందర్‌తోపాటు 80 మంది ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు బండి కోటేశ్వర్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పూలక్క, విద్యావంతుల వేదిక డివిజన్ అధ్యక్షుడు మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా ఇస్తాం



రాయపర్తి : సొసైటీ పరిధిలోని రైతులందరికీ యూరియా అందిస్తామని పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసి సమావేశంలో ఎంపీడీఓ గుగులోతు కిషన్‌నాయక్, ఏఓ గుమ్మడి వీరభద్రంతో కలిసి చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడారు. రైతులు ఆధార్ కార్డు చూపించి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో డైరెక్టర్ సోమనాయక్, పంచాయతీ కార్యదర్శి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

రాయపర్తి : విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మొరిపిరాలకు చెందిన వేల్పుల శ్రీను వాపోయారు. గ్రామంలోని సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి శ్రీనుకు చెందిన గొర్రె మృతి చెందగా రెండు అస్వస్థతకు గురయ్యాయి. ఈ సందర్భంగా శ్రీను గోడు వెళ్లబోసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నాడు.

మినీ స్టేడియంలో సౌకర్యాలు కల్పించాలి

నర్సంపేట: పట్టణంలోని మినీ స్టేడియంలో సౌకర్యాలు కల్పించాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడారు. స్టేడియంలో కబడ్డీ, రెజ్లింగ్ క్రీడా మ్యాట్లను అందించాలని కోరారు. నర్సంపేట జోన్ ఎస్‌జీఎఫ్ సెక్రటరీగా ఎన్నికైన సారంగపాణి, నల్లబెల్లి జోన్ ఎస్‌జీఎఫ్ సెక్రటరీగా ఎన్నికైన రామదాసును ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో టార్గెట్ బాల్ అసోసియేట్ జిల్లా సెక్రటరీ, స్టేడియం ఇన్‌చార్జ్ కోచ్ యాట రవికుమార్, డివిజన్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సంగెం : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గవిచర్లలో రూ.48 లక్షల వ్యయంతో చేపట్టిన గుండ బ్రహ్మయ్య ఆలయం పునర్నిర్మాణానికి 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి శనివారం భూమి పూజ చేశారు. అనంతరం మండలంలోని కాట్రపల్లి గ్రామంలో నిర్మించిన పోచమ్మతల్లి, అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాన మహోత్సవాల్లో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, చైర్మన్ వెంకట్రాంరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆలయాలతో సమాజంలో శాంతి నెలకొంటుందని చెప్పారు. ఆలయ నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.



పూజ చేస్తున్న ఎమ్మెల్యే, 'కుడా' చైర్మన్

ఎండోమెంట్ డీఈపై ఎమ్మెల్యే అసహనం

ప్రొటోకాల్ పాటించకుండా, శిలఫలకం వేయకుండా భూమి పూజ చేపట్టారంటూ ఎండోమెంట్ డీఈ రమేశ్‌పై ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖ మంత్రికి ఎందుకు ఆహ్వానం పంపలేదని ప్రశ్నించారు. ఆలయ చైర్మన్ కొంతం యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స మాత్రమే చేయండి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు

రాయపర్తి : ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గోపాల్‌రావు స్పష్టం చేశారు. పరిధికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మండల కేంద్రంలోని మెడికల్ షాపులను మాస్ మీడియా ఆఫీసర్ అనిల్‌కుమార్‌తో కలిసి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు శనివారం తనిఖీ చేశారు. మెడికల్ షాపులకు అనుమతులు, ఇతరత్రా సర్టిఫికెట్‌లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. మండలంలో డెంగీ కేసులు నమోదయ్యాయని చెప్పారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించారు. మెడికల్ షాపుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వనజ, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గోపాల్‌రావు

బిట్స్‌లో ప్రాంగణ నియామకాలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్స్ (బిట్స్) కళాశాలలో విద్యార్థులకు శనివారం ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్ మాట్లాడారు. బీటెక్ చివరి సంవత్సర చదువుతున్న విద్యార్థులకు టెక్అవుట్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రాంగణ నియమకాలు నిర్వహించగా 417 మంది దరఖాస్తు చేసుకోగా రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, హెచ్‌ఆర్ రౌండ్ పూర్తి అయి ఐదుగురు ఉద్యోగాలకు ఎంపికనట్లు తెలిపారు. అనంతరం ఎంపికైన వారిని నియామక పత్రాలు అందించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏటా రూ.3 నుంచి రూ.3.50 లక్షల వరకు వేతనం లభిస్తుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, ముఖ్య ప్రాంగణ నియామక అధికారి సురేశ్, ట్రెయినింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగ అధికారి ఫసీ అహ్మద్ పర్వేజ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉద్యోగ విరమణ సన్మానం



నల్లబెల్లి : శ్రీనివాస్‌రావును దంపతులను సన్మానిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు



సంగెం : కల్పనను సన్మానిస్తున్న తహసీల్దార్, ఉద్యోగులు

నల్లబెల్లి : ఉద్యోగ విరమణ సందర్భంగా ఎంఈఓ, రంగాపురం హైస్కూల్ హెచ్‌ఎం మోతుకూరి శ్రీనివాస్‌రావును స్థానిక ఫంక్షన్ హాలులో అధికారులు, ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానించారు. తొలుత దంపతులను బ్యాండ్ మేళాలతో విద్యార్థులు వేదికపైకి పూలు చల్లుతూ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నర్సింహమూర్తి మాట్లాడారు. శ్రీనివాస్‌రావు అందించిన సేవలను కొనియాడారు. ఎంఈఓ సత్యనారాయణ, సైన్స్ అధికారి శ్రీనివాస్, పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి గఫార్, యూటీఎఫ్ బాధ్యుడు రవూఫ్, డీసీఈబీ కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు..

సంగెం : తహసీల్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కల్పన ఉద్యోగ విరమణ చేయగా తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్, ఉద్యోగులు శాలువాతో సన్మానించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. కల్పన 24 ఏళ్లపాటు సేవాభావంతో పని చేశారని చెప్పారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, ఆర్‌ఐలు శారద, బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీబీ సూపర్‌వైజర్‌కు..

పర్వతగిరి : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు స్థానిక బ్రాంచ్ సూపర్‌వైజర్ సుధాకర్‌చారి పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్‌గౌడ్, ఉద్యోగులు సన్మానించారు. అనంతరం సుధాకర్‌చారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్, పీఏసీఎస్ సీఈఓ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయ అటెండర్‌కు..

చెన్నారావుపేట : మండల పరిషత్ కార్యాలయ అటెండర్ స్వరూపరాణి ఉద్యోగ విరమణ సందర్భంగా ఎంపీడీఓ శ్రీవాణి, ఏటీఓ చంద్రకళ ఆధ్వర్యంలో స్వరూపరాణి-కుమారస్వామి దంపతులను సన్మానించారు. అనంతరం ఎంపీడీఓ, ఏటీఓ మాట్లాడారు. స్వరూపరాణి 36 ఏళ్లపాటు సేవాభావంతో విధులు నిర్వర్తించారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టీఓ చొక్కారావు, కార్యాలయ సూపరింటెండెంట్ అయేషా పర్వీన్, అకౌంటెంట్ అయ్యూమ్, టైపిస్ట్ రజిత, సిబ్బంది సాగరిక, వాణి, నాగరాజు, అటెండర్లు నీల, వీరన్న, సారంగం, తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరి : సుధాకర్‌ను సన్మానిస్తున్న మనోజ్



చెన్నారావుపేట : సన్మానిస్తున్న ఎంపీడీఓ

సంక్షిప్త సమాచారం

నిధులు మంజూరు చేయండి

సంగెం : మండలంలోని గవిచర్లలోని కమ్యూనిటీ హాల్ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గౌడ కులస్తులు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుళ్లపల్లి శ్రీనివాస్, మందపురి అశోక్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమేశ్, శ్రీధర్, సదయ్య, కుమారస్వామి, శ్రీనివాస్, ఎల్లాగౌడ్, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో సీట్ల సంఖ్య పెంచాలి

నర్సంపేట : పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కళాశాలల్లో సీట్ల సంఖ్య పెంచాలని కోరుతూ ఏబీఎస్‌ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవరెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్‌ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శులు బొట్ల నరేశ్, జన్ను రమేశ్ మాట్లాడారు.

ఆర్థికసాయం

పర్వతగిరి : మండలంలోని కల్లెడకు చెందిన జీవంజి దీప్తి పారా ఒలింపిక్స్‌లో పాల్గొననున్న క్రమంలో తీన్మార్ మల్లన్న టీం రూ.లక్ష సాయం ప్రకటించింది. టీం ఆధ్వర్యంలో దీప్తి విషయాన్ని మల్లన్న దృష్టికి తీసుకెళ్లగా ఆయన దీప్తి తల్లి ధనలక్ష్మితో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది. మల్లన్న దీప్తిని, ఆమె కుటుంబానికి చెక్కు అందజేస్తామని తెలిపారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించండి

వర్ధన్నపేట : వాహనదార్లు, ప్రయాణికులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సామాజిక కార్యకర్త మాణిక్యరావు కోరారు. పట్టణంలోని బస్టాండ్‌లో ప్రయాణికులతో ఆయన మాట్లాడారు.

నివాళి

నర్సంపేట : పట్టణంలోని 10వ వార్డు పరిధిలోని వివేకానంద కాలనీకి చెందిన శాఖపురం కొమురమ్మ (70) శనివారం మృతి చెందగా ఆమె మృతదేహానికి స్థానిక కౌన్సిలర్ నాగిశెట్టి పద్మ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల సాయం అందజేశారు.

రోళ్లకల్‌లో..

పర్వతగిరి : మండలంలోని రోళ్లకల్‌కు చెందిని బైరి శాంతమ్మ (95) మృతి చెందగా ఆమె మృతదేహానికి సీపీఐ రాష్ట్ర నాయకుడు తాటిపాముల వెంకట్రాములు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శాంతమ్మ మృతి బాధాకరమన్నారు.